ఆరోగ్య మిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలి


మంత్రి రాజనర్సింహాకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆరోగ్య మిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని కోరుతూ తెలంగాణ యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను కలిసి వినతిపత్రం సమర్పించారు. కనీస వేతనం రూ. 35 వేలతోపాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సఫిలింగ్ విధానాన్ని రద్దు చేయాలని, 16 సంవత్సరాల నుంచి పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్రలను తిరిగి పీహెచ్‌సీలో నియమించాలని, ఆరోగ్య శ్రీలో ఖాళీలను భర్తీ చేయాలని, సీనియర్టి ప్రకారం ప్రమోషన్‌లు ఇవ్వాలని, విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగులకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ్మా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర ఆరోగ్యశ్రీ సిబ్బంది యూనియన్ అధ్యక్షుడు గిరి యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.కుమార్, సుమన్ తదితరులున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాలను బాగు చేసుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ గోడ్చల రచనశ్రీ అన్నారు. ఆదివారం దోమలగూడలోని కిడ్‌హుడ్ ప్రీస్కూల్‌లో బద్రీ విశాల్ పన్నాలాల్ పిత్తి ట్రస్ట్ అగర్వాల్ సమాజ్ తెలంగాణ శాఖ, అగర్వాల్ సమాజ్ హెల్త్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ భగవాన్ మహవీర్ వికలాంగ్ సహాయత్ సమితి, హైదరాబాద్, మెడికవర్ దవాఖాన బేగంపేట్, ఎల్‌సీఎస్ దండు ఐ ఇన్‌స్టిట్యూట్ వెస్ట్ మారేడ్‌పల్లి సహకారంతో ఏర్పాటు చేసిన 124వ మెగా మెడికల్ క్యాంపును ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ మెగా మెడికల్ క్యాంప్‌లో కంటి పరీక్షలు, జనరల్ ఫిజీషియన్, డెంటల్, ఫిజియోథెరపీ, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, ఈసీజీ, 2డి ఈకో, బీఎండీ, ఆర్‌బీఎస్, బీపీ పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ... ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు, స్థానిక నేతలు ప్రదీప్ అగర్వాల్, సుధీర్‌గుప్తా, సురేందర్ గోయల్, విజయ్ కుంచల, రష్మీ అగర్వాల్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎం.సి.మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్, రమేష్‌బాబు, శివరాజ్, అనిల్, అనుఫుల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ వాదులకు పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలి

కాచిగూడ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పర్యావరణ వాదులకు సీట్లు కేటాయించాలని 'ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సి.హెచ్.రంగయ్య ప్రధాన రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఓటు బ్యాంకు రాజకీయాలకు అలవాటు పడ్డ పార్టీలు సకల జీవరాశి మనుగడకు కారణమైన ప్రకృతి, పర్యావరణం గురించి ఆలోచించడం మర్చిపోయారని విమర్శించారు. పర్యావరణం అంటేనే సామాజిక సుస్థిరత అని తాము పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామనే పార్టీలు ఈ ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లో కనీసం ఒక సీటు అయినా పర్యావరణ ఉద్యమకారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో పర్యావరణ ఉద్యమకారులు ఉన్నప్పుడే పర్యావరణ చట్టాల రూపకల్పనకు మరింత మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. టికెట్లు ఇస్తే పర్యావరణ వాదులను పర్యావరణ ప్రేమికులు గెలిపించుకుంటారని ఆయన పేర్కొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ అంబర్‌పేట విస్తృత స్థాయి సమావేశం


మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: ఈ నెల 27 బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేద్దామని బాగ్‌అంబర్‌పేట డివిజన్ ఆ పార్టీ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి కోరారు. ఆదివారం డివిజన్‌లోని శ్రీనివాస నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన డివిజన్ పార్టీ నాయకులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 27న మహారాణాప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామరావు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌లు ముఖ్య అతిథిలుగా హాజరుకానున్నట్లు ఆమె వెల్లడించారు. నియోజకవర్గం స్థాయి సమావేశానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరైయ్యేలా కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, చంద్రమోహన్, శ్రీరాములు ముదిరాజ్, మహేందర్‌రెడ్డి, గెల్వయ్య, రవీందర్, సంజీవ్‌చౌదరి, జె.బాలరాజు, సంతోష్ పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడండి


సునార్‌లేన్‌లో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అధికారులకు సూచించారు. ఆదివారం జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్‌లోని మోతీమార్కెట్, అంబాజీగల్లీ, సునార్‌లేన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అంబాజి గల్లీలో సరిగ్గా మంచినీటి సరఫరా జరగడం లేదని స్థానికులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం తగదని అన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, సుభాష్ పటేల్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్, లావణ్య పాల్గొన్నారు.

దళితులకు రిజర్వేషన్లు పెంచాలని దీక్ష



కవాడిగూడ: దళితులకు 18 శాతం రిజర్వేషన్‌ను పెంచాలని తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాప అధ్యక్షుడు గంధం సుమన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లోని 59 ఉప కులాలు దళిత ప్రజలు పెరిగిన జనాభాకు అనుగుణంగా 18 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అన్ని రాజకీయ పార్టీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు చట్ట సభల్లో బిల్లులు ఆమోదింపజేసేట్లు తీర్మానం చేయాలన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా విద్యా, ఉద్యోగం, ఉపాధి, అభివృద్ధి సంక్షేమ, రాజకీయ రంగాల్లో దళిత ప్రజలకు 18 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండి అజయ్‌మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి.శ్రీకాంత్‌మాదిగ, డబ్బా రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు

ముషీరాబాద్: ఆర్యవైశ్య సంఘం రాంనగర్ ఆధ్వర్యంలో సుదర్శన హోమం, మహా మృత్యుంజయ హోమాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జెమిని కాలనీలోని శివాలయంలో ఆర్యవైశ్య ఫామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ రాంనగర్ ఆధ్వర్యంలో ఉదయం 8.55 గంటలకు సుదర్శన హోమం, మహామృత్యుంజయ హోమాలు నిర్వహించారు. సంఘం సభ్యులు సతిసమేతంగా హోమంలో కూర్చొని పూజలు నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. హోమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పూజల్లో సుధాకర్ గుప్తా, ఎర్రం శ్రీనివాస్, నేతి సత్యనారాయణ, సత్య వర్ధన్, పులిగిల్ల కృష్ణమూర్తి, రంగారావు, గంప మల్లేశం, రమేశ్రాం, రామనాథం, రఘురాములు, ఎర్రం చంద్రశేఖర్, ఎర్రం రమేష్, చామల శ్రీనివాస్, రాజశేఖర్‌గుప్తా, ప్రకాష్, చల్ల శివకుమార్, పోకల నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఆర్య వైశ్య సంఘం సభ్యులు

రేబిస్.. డేంజర్ బెల్స్!

నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రికి కుక్కకాటు బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ఈ సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కల్గిస్తోందంటూ వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. కుక్క కాటుకు గురైన వారు సకాలంలో చికిత్స, తగు టీకాలు వెయించుకోకుంటే ప్రాణాంతక రేబిస్ వ్యాధి బారిక పడి మరణించిన సంఘటనలు చాలానే ఉన్నాయంటున్నాయి.


ఫీవర్ ఆస్పత్రికి వ్యాక్సిన్ కోసం వచ్చిన కుక్కకాటు బాధితులు

నల్లకుంట: వేసవి ముంచుకొస్తోంది. ఎండలు ముదిరితే ఆ వేడికి కుక్కలు విచిత్రంగా ప్రవర్తిస్తుంటాయి. ఒక్కోసారి పిచ్చికుక్కల్లా ప్రవర్తిస్తుంటాయి. ఆయా కుక్కలు కరిస్తే ప్రాణాంతక రేబిస్ వ్యాధిన పడే అవకాశం ఉంటుంది. దురదృష్టవశాత్తు కుక్కకాటుకు గురైతే వెంటనే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్వీ), రేబిస్ ఇమ్యూనో గ్లోబులిన్(రిగ్) యాంటీ సీరం వేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో ఏటా 15 వేలకు పైగా కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. వీరిలో పది మందికి పైగా రేబిస్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఏది పిచ్చి కుక్క.. ఏది మంచి కుక్క అనే విషయం తెలియక కొందరు ప్రైవేటు అస్పత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేసి ఇంజక్షన్లు వేయించుకుంటున్నారు.
- నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో నిత్యం 30 నుంచి 80 మంది వరకు కుక్క కాటుకు గురైన వారు 'రిగ్' ఇంజక్షన్ కోసం వస్తున్నారు. ఖరీదైన ఈ ఇంజక్షన్ ఇక్కడ ఉచితంగా ఇస్తారు.

వ్యాధి లక్షణాలు ఇలా...

హైడ్రో ఫోబియా (జల భయం), ఫొటో ఫోబియా (వెలుతురు భయం), అంధత్వం, మతిభ్రమణం, ప్రాణభయంతో కేకలు పెట్టడంలాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి మెదడు, నరాలకు సంబంధించింది కాబట్టి చికిత్స తాత్కాలికమే. అందువల్ల కుక్కలు కరిచిన వారు ముందు జాగ్రత్తగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్వీ), రేబిస్ ఇమ్యూనో గ్లోబులిన్(రిగ్) వేయించుకోవడం తప్పనిసరి.

- వేసవి ఎండలతో కుక్కలతో మరింత ప్రమాదకరం
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పు
- రేబిస్‌తో ఏటా పదికి పైగా మరణాలు
- ఫీవర్ ఆస్పత్రికి పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

- సాధారణంగా పిచ్చి కుక్కలు కరిచిన తర్వాత ఈ వ్యాధి సోకడానికి పది రోజుల నుంచి ఏడు వారాల సమయం పడుతుంది. కొన్ని సందర్భాల్లో రెండు సంవత్సరాల సమయం కూడా పడుతుంది. రేబిస్ సోకితే ముందుగా జ్వరం, దగ్గు, గొంతు బొంగరు పోవడం, కుక్క కరిచిన ప్రదేశంలో దురద, నొప్పి, మంటతో పాటు తిమ్మిరి ఉంటుంది. కడుపు నొప్పి, చికాకు, ఆందోళన, నీళ్లు చూసి భయపడటం (హైడ్రోఫోబియా), గాలి అలికిడి విన్నా భయపడతారు. కొన్ని సందర్భాల్లో ఫిట్స్ వచ్చి కోమాలోకి వెళ్లి మరణిస్తారు.

వ్యాధిని నిరోధించే మార్గాలు..

రేబిస్ వ్యాధి నివారణకు కుక్కలకు టీకాలు వేయించడమే సరైన మార్గం. మూడో నెలలో ఒకసారి బూస్టర్ డోస్ వేయించాలి. అక్కడి నుంచి ఏడాదికోసారి రేబిస్ టీకాలు వేయించాలి.

- పిచ్చి కుక్క కరిస్తే మొత్తం ఆరు టీకాలు వేయించాలి. కరిచిన వెంటనే ఒకటి, అక్కడి నుంచి 3, 7, 14, 28వ రోజున టీకాలు వేయించాలి. చివరగా 90వ రోజున బూస్టర్ డోస్ వేయించాలి. పరిస్థితిని బట్టి 'రేబిస్ హ్యూమన్ ఇమ్యూనో గ్లోబులిన్' యాంటీ సీరంను కూడా ఉపయోగించి వ్యాధిని నిరోధించవచ్చు. వీటి వల్ల శరీరానికి సత్వర రక్షణ ఏర్పడటమే కాకుండా టీకాలు వేయించటం వల్ల మన శరీరమే యాంటీ బాడీస్‌ను ఉత్పత్తి చేసుకుంటుంది.

> **నివారణే మార్గం..**
>
> 
>
> రేబిస్ వ్యాధికి చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గం. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని డెటాల్, కార్బొలిక్ ఆమ్లం, టింక్చర్ అయోడిన్ ఉపయోగించి శుభ్రంగా కడగాలి. కుక్క కరిచిన వెంటనే గాయానికి కుట్లు వేయడం, కాల్చడం లాంటివి చేయకూడదు. కుట్లు వేస్తే సెప్టిక్ అయ్యే ప్రమాదం ఉంది. ఏ వయసు వ్యక్తులకైనా కుక్క కరిచిన వెంటనే రేబిస్ వ్యాధి నుంచి రక్షణకు టీకాలు తప్పక వేయించుకోవాలి. ఈ టీకాలు ఆరు విడతల్లో ఇవ్వాలి. ఈ టీకాల్ని ఒక మిల్లీలీటరు చొప్పున తుంటి భాగంలో కుక్క కరిచిన రోజున (ఒకటి), 3, 7, 14, 28వ రోజులలో వేయాలి. అలాగే 90వ రోజున బూస్టర్ డోస్ వేయించుకోవాలి.
>
> – డాక్టర్ కె.శంకర్, ఫీవర్ ఆస్పత్రి సూపరింటిండెంట్

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ బోర్‌బంజారా ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జగన్నాథరావు, ఐఏఎస్ అధికారి భారతీలక్పతినాయక్‌లు మాట్లాడుతూ... సేవాలాల్ సేవలను కొనియాడారు. సేవలాల్ స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా గోర్‌సిక్వాడి నాయకులు బొజ్జ నాయక్, తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రతినిధులు బాలాజీనాయక్, సుదర్శన్‌నాయక్, రాంబాబునాయక్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు యూనివర్సిటీకి వెన్నెముక

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: పూర్వవిద్యార్థులు ఓయూకు వెన్నెముక అని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. ఆదివారం ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీలో జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కళాశాలలో చేపట్టిన పలు నిర్మాణాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వందేళ్లు పూర్తి చేసుకున్న ఓయూ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలన్నారు. టెక్నాలజీ కాలేజీలో విద్యార్థి దశలోని జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం ప్రొ. ప్రభాకర్‌రెడ్డి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఓయూ వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మళయాలీ అసోసియేషన్ చైర్మన్‌గా సురేంద్రన్

రాంగోపాల్‌పేట్: ఆల్ ఇన్ మళయాలీ అసోసియేషన్ తెలంగాణ చైర్మన్‌గా కన్నాట్ సురేంద్రన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చైర్మన్‌గా కన్నాట్ సురేంద్రన్, ప్రెసిడెంట్‌గా బాబు ఉన్నున్నీ, వైస్ ప్రెసిడెంట్‌గా టీఏ మ్యాథ్యూ, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా సంతోష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కృష్ణకుమార్, కోశాధికారిగా సేథు మాధవన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా విశ్వనాథన్, కేఆర్ శశిధరణ్, ఎంఎస్ రాజేష్‌కుమార్, వేణుగోపాల్, కేవీ శణ్ముఖన్‌లు మహిళ వింగ్ నుంచి టీఎస్ వల్సాలా, బిజీ మ్యాథ్యూ, సరిత సునీల్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ కన్నాట్ సురేంద్రన్ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా తమ అసోసియేషన్ తెలంగాణలోని మళయాలీతో పాటు పేద వర్గాల ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు.

1 నుంచి బీసీల మహా పాదయాత్ర


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

కాచిగూడ: చట్టసభల్లో బీసీల వాటా కోసం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీ నుంచి చేపట్టనున్న మహా పాదయాత్ర పోస్టర్‌ను ఆదివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, హిందూ బీసీ మహాసభ, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీన మహబూబ్ నగర్ జిల్లా నవాబ్ పేట్ మండలం మిర్గాన్ పల్లె నుంచి మహా యాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. 23 రోజుల పాటు 360 కిలోమీటర్ల సాగే మహా పాదయాత్ర జనగామ జిల్లా ఖిలాషాపూర్ వరకు జరుగుతుందని తెలిపారు. నేతలు బత్తుల సిద్దేశ్వర్లు, ఎర్ర శ్రీహరి గౌడ్, గిరగాని భిక్షపతి, దుబ్బకోటి అంజనేయులు, బత్తుల రామ నర్సయ్య, కొంగర నరహరి, పర్వత సతీష్ కుమార్, చింతలగారి వెంకట స్వామి, పంతుల మల్లయ్య, కె.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ్ సినిమాలు చరిత్రలో సుస్థిరం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి


షరాన్ లోవెన్‌ను సత్కరిస్తున్న జస్టిస్ రాధారాణి

చిక్కడపల్లి: దేశంలో వంద ఉత్తమ సినిమాలలో పది సనిమాలు విశ్వనాథ్‌వే ఉంటాయని ఉంటాయని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన శంకరాభరణం, సాగర సంగమం, స్వర్ణ కమలం, స్వాతి కిరణం వంటి భిన్న కథాచిత్రాలు చరిత్రలో సుస్థిరంగా ఉంటాయని కొనియాడారు. కళానియం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో కె.విశ్వనాథ్ జయంతి సందర్భంగా స్వర్ణకమలంలో నటించిన షరాన్ లోవెన్‌ను జస్టిస్ రాధారాణి సత్కరించి మాట్లాడారు. అమెరికా దేశీయురాలైన షరాన్ లోవెన్ భారతీయ నాట్య ప్రక్రియలపై అధ్యయనం కోసం వచ్చి ఒడిస్సీ, కథక్ వంటి నాట్యాలలో పరిణితి సాధించి స్వర్ణకమలంలో నటించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారని ప్రసంసించారు. షరాన్ లోవెన్ మాట్లాడుతూ... ప్రతి దేశానికి కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాథమిక లక్షణాలు అన్నారు. తనకు తన అమెరికా సంస్కృతి పట్ల గౌరవం ఉందని అలాగే భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ప్రాథమిక లక్షణాలు ఆదర్శమన్నారు. విశ్వనాథ్ కుమారుడు నాగేందర్ మాట్లాడుతూ... తమ తండ్రి చివరి రోజుల్లో ఎక్కువ సార్లు స్వర్ణకమలం సీడీ చూసేవారని చెప్పారు. ప్రముఖ నాట్య గురువు డాక్టర్ ఎస్.పి.భారతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీరామరాజు, సినీ నిర్మాతలు బద్రీనాథ్, మురళీధర్, శంకర్‌పల్లి స్వయంభు మరకతలింగస్వామి ధర్మకర్త ధూపాటి దయాకర్‌రాజుస్వామి పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు పుష్ప, కార్యదర్శి సురేందర్ సారథ్యంలో నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నారు.

వర్గీకరణకు మద్దతిచ్చే పార్టీలను ఓడించాలి


మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు రాజు

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్న అగ్రకుల పార్టీలను రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం చేస్తున్న కుటిల రాజకీయంపై తిరుగుబాటుకు సిద్ధం కావాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎల్.రాజు పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సంస్థ కేంద్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా దళితులను అణిచివేయాలని రాజ్యాధికారం చేపట్టకుండా ఉండేందుకు 19 ఏళ్ల క్రితం సుప్రీం కోర్ట్ కొట్టివేసినా ఎస్సీ వర్గీకరణ అంశాన్ని మళ్లీ బీజేపీ ప్రభుత్వం సుప్రీం కోర్ట్ ద్వారా వర్గీకరణ చేయడానికి కుట్రలు చేస్తున్నారని వారు ఆరోపించారు. దీనిద్వారా బీజేపీ రాజకీయ లబ్ధి కోసం దళితుల విచ్చిన్నానికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. వర్గీకరణకు మద్దతుగా అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జె.ఎస్.రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ భాస్కర్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అర్షల రాజు, నక్కా దేవేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలిజాల ప్రవీణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.బాలస్వామి, వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య కీర్తనలు


అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

నల్లకుంట: అన్నమయ్య పరివారం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో 'అన్నమయ్య సంకీర్తన మాధుర్యం' భక్తి సంగీత కార్యక్రమం ఆద్యంతం సంగీత ప్రియులను అలరించింది. అన్నమయ్య సంకీర్తనా చూడామణి ఎస్.సి. శ్రీదేవి, స్నేహంకితలు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. దీనికి కీ బోర్డుపై ఎస్.బాలాజీ, తబలాపై పాండురంగారావు, రిథమ్స్‌పై సురేష్ వాద్య సహకారమందించారు. కార్యక్రమంలో శంకరమఠం నల్లకుంట శాఖాధిపతి కె.కృష్ణారావు, అన్నమయ్య పరివారము వ్యవస్థాపకుడు యనమండ్ర వెంకట కృష్ణయ్య, సభ్యులు కందుకూరి సుబ్రహ్మణ్యం, పురంధర్, కాండూరి శ్రీలక్ష్మి, సంగీత, ప్రముఖ వాగ్గేయ కారుడు నల్లాన్ చక్రవర్తి, సీనియర్ పాత్రికేయుడు వల్లీశ్వర్ పాల్గొన్నారు. సంగీత కళాకారులను ఘనంగా సన్మానించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప సమాచారం మేరకు... జామై ఉస్మానియా–విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని మహిళ(55) రైలు ఢీకొని మృతి చెందింది. మృతురాలి ఒంటిపైన ఆరంజ్ రంగు చీర, ఎరుపు, పసుపు రంగు జాకెట్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వి.ఎల్.చారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వయోవృద్ధుల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ అవసరం

లక్డీకాపూల్: మధుమేహం, వయోభారంతో శరీరంలో వచ్చే మార్పులు, వినికిడి లోపం, చూపు మందగించడం వంటి సమస్యలు వృద్ధుల జీవనయానాన్ని సంక్లిష్టం చేస్తాయని సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్, ప్రముఖ జెరియాట్రిక్ స్పెషలిస్ట్ డాక్టర్ వసంత్‌కుమార్ చెప్పారు. ఇలాంటి సమయంలో వారికి కుటుంబ సభ్యుల చేయూతతోపాటు వైద్య సమస్యలను గుర్తించి చికిత్స అందించే జెరొంటాలజిస్ట్ (వృద్ధుల వైద్యనిపుణుల) అవసరం ఎంతో ఉందన్నారు. ఆదివారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఉచ్ఛ్వాస్ ట్రాన్సిషన్ కేర్ సెంటర్‌లో ఎల్డర్ ఎయిడ్ సంస్థ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వయో వృద్ధుల అలనాపాలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ.. తీసుకునే ఆహారం, తేలికపాటి వ్యాయామాలు, ఆరోగ్యకరమైన జీవన విధానంతో.. సమస్యలను అధిగమించవచ్చన్నారు. వీరి విషయంలో ప్రస్తుతం ప్రివెంటివ్ మెడిసిన్, జెరొంటాలజిస్ట్‌లతోపాటు వారికి అన్ని రకాలుగా సేవలందించే సంస్థల ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. ఉచ్ఛ్వాస్ ట్రాన్సిషనల్ కేర్ ప్రతినిధులు సతీష్, పవన్, ఎల్డర్ ఎయిడ్ ప్రతినిధులు మందిరా జయసింహ పాల్గొన్నారు.

సామాజిక, ఆర్థిక కుల సర్వేపై చర్చా వేదిక

ఖైరతాబాద్: సంచార జాతులుగా, నిరాశ్రయులుగా ఉన్న ప్రజలను ప్రత్యేకంగా గుర్తించి కుల సర్వేలో వివరాలు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి మేథో మదన సభ విజ్ఞప్తి చేసింది. ఆదివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో భారతీయ ఓబీసీ సమాఖ్య ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక కుల సర్వేపై మేథోమథనం పేరుతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే ఈ సర్వేలో పాటించాల్సిన విధి విధనాలు, కార్యాచరణపై మేధావులు సభలో సుదీర్ఘ సమాలోచనలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, ప్రధాన వక్తగా మాజీ చైర్మన్ బి.ఎస్.రాములు హాజరయ్యారు. భారతీయ ఓబీసీ సమాఖ్య అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు సమన్వయ కర్తగా వ్యవహరించారు. సంచార, అర్ధసంచార, విముక్త జాతులు, కులాలు, నిరాశ్రయులుగా ఉన్న వారు, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి అందుకోలేక పోతున్న ప్రజలు, ఆధునిక అభివృద్ధికి దూరంగా ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని, ఇలాంటి నిర్లక్ష్య వర్గాలను సమాజ ప్రగతిలో భాగస్వాములను చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తి అని మేథో మధనంలో సుదీర్ఘ చర్చ జరిగింది.

రైతులపై కేంద్రం తీరు దారుణం

హిమాయత్‌నగర్: రామరాజ్యం, దేశమంతా ఇంటింటికీ రాముడి అక్షింతలు, జై శ్రీరామ్ పేరుతో ఆర్‌ఎస్‌ఎస్, మోదీ ప్రభుత్వం రైతులను నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపుతోందని ఇంక్విలాబ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ జానీ ఉమర్, ఇంక్విలాబ్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎం హుస్సేన్‌లు ఆరోపించారు. మోదీ ప్రభుత్వం కాల్చి చంపిన శుభకరన్ సింగ్ హత్యను ఖండిస్తూ ఆదివారం కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహ్మద్ జానీ ఉమర్ మాట్లాడుతూ... గతంలో మోదీ ప్రభుత్వం, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసిందని, ఆ సందర్భంగా ఇచ్చిన కనీస మద్దతు ధరకు చట్టం చేస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకుండా రైతులను మోసం చేస్తుందన్నారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా రాష్ట్రాల రైతులు ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడుతుంటే వారిపై అప్రజాస్వామ్యంగా, క్రూరంగా రబ్బరు బుల్లెట్‌లు కురిపించి ఒక యువ రైతును కాల్చి చంపడం దుర్మార్గమన్నారు. ఇది రైతు,ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమని స్పష్టం చేశారు.తక్షణం కేంద్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఇంక్విలాబ్ సేన నాయకులు డాక్టర్ సలీం, కాసాని శ్రీనివాస్, సిరాజ్, ఆమెనా, ఫార్జానా పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ప్రత్యేక ఉద్యమం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మేధావుల సహాయ సహకారాలతో ముందుకు సాగుతామని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఆదివారం సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ కమ్యునిటీహాల్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులతో లష్కర్ జిల్లా సాధన సమితి నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ సాధన సమితి రిజిస్ట్రేషన్ పత్రాలు, లెటర్‌హెడ్‌లను ఆవిష్కరించారు. పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. జిల్లా ఏర్పాటు కోసం రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అధికార పార్టీ నాయకులకు వినతిపత్రాలు అందించామన్నారు. అన్ని వర్గాల నాయకుల మద్దతు సేకరించిన తర్వాతే ఉద్యమ కార్యక్రమాలను ప్రారంభిస్తామన్నారు. సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుతో పరిపాలనా సౌలభ్యంతో పాటు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ప్రత్యేక జిల్లా కోసం తాము చేస్తున్న ఉద్యమానికి సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు సాధం బాల్‌రాజ్‌యాదవ్, మిట్టపల్లి బాబూరావు, శైలేందర్, రవీందర్‌సాగర్, కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.